క్లుప్తంగా

నేడు కపిలేశ్వరపురం మండల సమావేశం

కపిలేశ్వరపురం: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సంబంధిత అధికారులు తమతమ శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

మహిళకు అమ్మ ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాగభూషణం

మండపేట: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద మహిళ వైద్య సాయం నిమిత్తం పట్టణానికి చెందిన అమ్మ ఫౌండేషన్ ఆదివారం రూ.35,000 ఆర్థిక సాయం అందించింది. ఎస్. నాగమణి కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. ఆమె దీనస్థితి తెలిసి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యిమిడిశెట్టి నాగభూషణం తన మిత్రులు, దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.35,000 మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద మహిళ వైద్య కోసం నాగభూషణం చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

బోస్ పరామర్శ

కె.గంగవరం: మండలంలోని దంగేరు శివారు కూనిమిల్లిపాడుకు చెందిన దంగేటి చిన్న సత్తిరాజు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సత్తిరాజు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, పెద్దలు శ్యాంప్రసాద్, కాదా వెంకటేష్, గురుమూర్తి, పంపన కొండ, కాదా నాగేశ్వరావు, పోలినాటి ప్రసాద్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో కొలువైన ధనమ్మ తల్లి సందర్శనకు భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇటీవల వరద ప్రభావానికి ధనమ్మ మర్రి ప్రాంతం వరద నీటిలో చిక్కుకుంది. వరదనీరు వీడిన తర్వాత ఆలయాన్ని సందర్శనకు సిద్ధం చేశారు. ఆదివారం కావడంతో కపిలేశ్వరపురం, మండపేట, కొత్తపేట, అయినవల్లి మండలాల భక్తులు అమ్మవారిని సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి



మండపేటలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ఆదివారం బీజేపీ నియోజకవర్గ కో -కన్వీనర్ కేవీవీ సాయిరాం ఆధ్వర్యంలో పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. భారతమాతకు జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. పెద కాలువ వంతెన వద్ద మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాన్ని కడిగి శుభ్రం చేశారు. పార్టీ నాయకులు కోన సత్యనారాయణ, చాట్రాతి జాన కి రాంబాబు, మద్దుల సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సోషల్ మీడి యా అకౌంట్లకు డీపీగా జాతీయ జెండాను పెట్టు కుని స్వాతంత్ర్య స్ఫూర్తి చాటాలన్నారు. పార్టీ నాయకులు వి.రవీంద్రబాబు, రాంబాబు, దుర్గ శ్రీనివాస్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

కె.గంగవరం ఎస్సైగా జానీ బాషా

కె.గంగవరం: మండల ఎస్సైగా ఎస్‌కే జానీ బాషా నియమితులయ్యారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన కె.చిరంజీవి ఇటీవల సీతానగరం బదిలీపై వెళ్లారు. మామిడికుదురు మండలం నగరం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జానీ బాషా బదిలీపై కె.గంగవరం రానున్నారు. ఇప్పటి వరకు ఏఎస్సై రాంబాబు ఇన్‌చార్జ్ ఎస్సైగా ఇక్కడ విధులు నిర్వహించారు.

16న చంద్రబాబు రాక

మండపేట: ఈనెల 16న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు మండపేట వస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. పర్యటన ఏర్పాట్లుపై సమీక్షించేందుకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నేతలతో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు తరలి వచ్చి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీఎస్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పాల్గొన్నారు.

దేశభక్తి.. చాటుదాం ఘన కీర్తి

- వాడవాడలా నా మట్టి- నా దేశం
- క్లస్టర్ పరిధిలో 120 పంచాయతీల్లో అమలు



రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న నా భూమి- నా దేశం కార్యక్రమం

రాయవరం: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి, వారిని చైతన్య పరచడానికి కేంద్ర ప్రభుత్వం 'నా మట్టి–నా దేశం', 'నేలతల్లికి నమస్కారం -వీరులకు వందనం' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపడుతోంది. ఈ నెల 9 నుంచి ప్రారంభమైన ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 15 వరకూ గ్రామ పంచాయతీలు, మండల ప్రధాన కార్యాలయాల్లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో దేశం కోసం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ రంగం, కేంద్ర సాయుధ దళాలు, పోలీసు శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారిని లేదా ప్రాణాలర్పించిన వారి కుటుంబ సభ్యులను గ్రామస్తుల సమక్షంలో ఘనంగా సత్కరిస్తున్నారు. ఆ త్యాగమూర్తుల పేరిట శిలాఫలకాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటి చుట్టూ దీపాలంకరణ చేసి వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతిజ్ఞ చేస్తున్నారు. అలాగే శిలాఫలకాల వద్ద ఉన్న మట్టిని కలశాల్లోకి సేకరించి మండల కేంద్రానికి, ఆ తర్వాత జిల్లా కేంద్రానికి పంపిస్తారు. మండలానికో యువకుడిని ఎంపిక చేసి వారితో ఆ మట్టి కలశాలను దేశ రాజధానికి పంపిస్తారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దీర్ఘకాలం ఉండే 75 మొక్కలను అనువైన చోట నాటడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న వారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలోని 120 పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.

ఉపాధి నిధులతో..

ఈ కార్యక్రమంలో శిలాఫలకాలు, మొక్కల కొనుగోలు, నాటడం సహా ఇతర ఖర్చులను ఉపాధి హామీ నిధుల నుంచి ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అలాగే శిలాఫలకాల రూపకల్పనకు అయ్యే ఆర్ట్ వర్క్ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అటవీ, ఉద్యాన, డ్వామా శాఖలు ఈ కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహిస్తున్నాయి.

ఊరంతా ఉత్సాహంగా..

జాతీయ సమైక్యతా భావాన్ని పది మందిలో స్ఫూర్తి రగిలించడం నా మట్టి- నా దేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు, యువకులు భాగస్వాములు అవుతున్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవడం, ఇంకా జీవించి ఉన్న ఇలాంటి వారిని ఘనంగా సత్కరిస్తున్నారు.

ప్రజల స్పందన బాగుంది



ప్రభుత్వం నిర్వహిస్తున్న నా భూమి–నాదేశం కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన బాగుంది. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లయిన సందర్భంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, మొక్కలు నాటడం, శిలాఫలకాలు ఆవిష్కరించడం చేస్తున్నాం.

– ఎ.శాంతి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, రామచంద్రపురం

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు



నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నాం. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడం, ప్రతి ఒక్కరిలో దేశ భక్తిని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. గ్రామాల వారీగా కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నారం. ఈ కార్యక్రమాల్లో ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– కె.నరేంద్రరెడ్డి, ఎంపీడీవో, రాయవరం

మంత్రి వేణుకు అడుగడుగునా హారతులు



అన్నాయిపేటలో మంత్రి వేణుకు హారతి ఇస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న అన్నాయిపేటలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న రెండు రోజులూ మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. ఏళ్ల తరబడి సమస్యగా ఉన్న సొంత ఇంటి సమస్యను పరిష్కరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సొంత ఇంటి స్థలాలను పెద్ద ఎత్తున ఇవ్వడంతో మహిళలు మంత్రి వేణుకు ఘన స్వాగతం పలికారు. మంత్రి వేణు ప్రతి గడపకూ వెళ్లి ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరిస్తూ.. సమస్యలు ఉంటే తెలుసుకుని పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, గ్రామ మాజీ సర్పంచ్ పాలిక అప్పారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక పెద్దలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో ఎస్పీ కుటుంబం



ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి పెరుగు నివేదన చేస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి కుటుంబం

రామచంద్రపురం రూరల్: తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణతో కలసి కుటుంబ సమేతంగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి–మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంత్రి వేణు సూచనతో ఎస్పీ కుటుంబం భీమేశ్వరునికి దధి సేవ (ఆవు పెరుగు నివేదన)లో పాల్గొన్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. ఈఓ తారకేశ్వరరావు మంత్రి వేణు, ఎస్పీ దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. వారి వెంట రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, రామచంద్రపురం సీఐ దుర్గారావు, ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు భూములకు సాగు నీరందించాలి



పెనుమళ్లలో రైతులతో కలసి ఆందోళన వ్యక్తం చేస్తున్న వల్లు రాజబాబు తదితరులు

కాజులూరు: శివారు భూములకు సాగు నీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని టి.మామిడాడ, తర్లంపూడి పెనుమళ్ళ, అయితపూడి, అంద్రంగి తదితర గ్రామాల్లో నీరు లేక తడి ఆరిపోతున్న వరి పొలాలను పరిశీలించి రైతులతో కలసి ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.15 వేలు పైబడి పెట్టుబడి పెట్టారని అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి సువ్వారి గోవిందు, పెనుమళ్ళ మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, మండల కౌలు రైతు సంఘం నాయకులు వాసంశెట్టి సత్యనారాయణ, మేడిశెట్టి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రజక సమస్యలపై ఆత్మీయ సదస్సు



గొల్లపాలెం ఆత్మీయ సమావేశంపై సభ్యులతో చర్చిస్తున్న రజక సంఘ పెద్దలు

కాజులూరు: రజకుల సమస్యలపై చర్చించేందుకు త్వరలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సమక్షంలో ఒక ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నట్టు రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పేరూరి సోమరాజు (కాకతీయ రాజు) తెలిపారు. నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకతీయ రాజు తదితర రజక నాయకులు ఆదివారం మండల గ్రామాల్లో పర్యటించి సంఘ సభ్యులను కలుసుకున్నారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రజకులకు తగిన ప్రాధాన్యం లభించిందని అయితే గ్రామాల్లో ఉన్న చిన్న, చిన్న సమస్యలను మంత్రి వేణు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమయం, స్థలంపై చర్చించేందుకు గ్రామాల వారీగా సభ్యులను కలుస్తున్నామన్నారు. రామచంద్రపురం పట్టణ, కాజులూరు మండల కమిటీల అధ్యక్షులు వాడపర్తి శ్రీనివాసు, కొత్తపల్లి కొండ, బాబ్జి పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దరిశి చెంచయ్య జీవితంపై పుస్తకావిష్కరణ



దరిశి చెంచయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, డాక్టర్ స్టాలిన్ తదితరులు

రామచంద్రపురం: భారత స్వాతంత్ర్య సమర యోధుడు, గదర్ వీరుడు దరిశి చెంచయ్యపై జీవితంపై ముద్రించిన దరిశి చెంచయ్య–ఆయన జీవితమే ఒక సందేశం పుస్తకావిష్కరణ ఆదివారం పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చెలికాని స్టాలిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి స్థాపకుడు నల్లూరి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో గదర్ మహోద్యమంలో తెలుగు నేల నుంచి పాల్గొన్న ఒకే ఒక్క దరిశి చెంచయ్య అని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమ చరిత్ర–చెంచయ్య కృషి అనే అంశంపై ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి డి.సోమసుందరం ప్రసంగించారు. కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణల ప్రభావంతో మూఢనమ్మకాలకు, సాంఘిక దురాచారాలకు, అంటరానితనానికి వ్యతిరేకంగా చెంచయ్య పోరాటం చేశారన్నారు. మహిళలు, వితంతువుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. చెంచయ్య జీవితం–ప్రాసంగిత సందేశం అనే అంశంపై వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ విముక్తి కోసం చెంచయ్య తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారన్నారు. కార్యక్రమంలో ప్రగతి శీల రచయిత గౌరవ్, పి.రాము, యు.గోపాల్, ప్రేమానందం, బి.సిద్ధూ, లెనిన్, సాయి, శారదాదేవి, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామానా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ భవాని, ఎంపీటీసీ సతీష్, సర్పంచ్ మంగాదేవి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, బాపనయ్యచెరువు, వేగాయమ్మపేట, కాపవరం, తాడిపల్లి గ్రామాల్లో ఆదివారం నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, పిల్లి సూర్యప్రకాశరావు, అంబటి తుకారం, యనమదల మంగాదేవి, పిల్లి అచల రాజశ్రీ, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు రెడ్నం సతీష్, మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, ఆయా గ్రామాల పంచాయతీ వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సందేశాలు, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లోగో, స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు తదితర వివరాలతో కూడి శిలాఫలకాన్ని ప్రారంభించారు. శిలాఫలకాల వద్ద మొక్కలు నాటారు. శిలాఫలకం చుట్టూ దీపాలు వెలిగించారు. అందరూ కలసి ప్రతిజ్ఞలు చేశారు. కాపవరంలో ఎంపీటీసీ రెడ్నం సతీష్ ఆధ్వర్యంలో ఆర్మీలో పనిచేసిన పులగల కృష్ణస్వామి సోదరుడు గంగరాజు, అనుసూరి శ్రీనివాసు, వాసంశెట్టి మధుబాబు, విశ్రాంత ఎక్సైజ్ ఎస్సై చోడే వీర్రాజు, హెడ్‌కానిస్టేబుల్ గంధం సత్యనారాయణ భార్య భారతిలను ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ యనమదల మంగాదేవిల చేతుల మీదుగా సత్కరించారు.

ఈదురు గాలులకు విరిగి పడిన చెట్టు



పడిపోయిన చెట్టును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది, కేశవరం గ్రామస్తులు

మండపేట: మండలంలోని కేశవరం, ఆ పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. గ్రామంలోని ఇందిరమ్మ చావిడి వద్ద చెట్టు విరిగిపోయి విద్యుత్తు లైన్లపై పడిపోవడంతో లైన్లు కిందికి వాలిపోయాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత తుపాకుల ప్రసన్నకుమార్ సమస్యపై పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు. పంచాయతీ సిబ్బంది, స్థానికులు కలిసి పడిపోయిన చెట్లను తొలగించగా విద్యుత్ సిబ్బంది లైన్లను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

ఉదయం ఎండ.. సాయంత్రం గాలివాన

రాయవరం: ప్రస్తుత వాతావరణం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది.కొద్ది రోజులుగా ఒక పక్క అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోపక్క ఒక్కసారిగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేసవిని తలపించింది. ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసింది. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు లేకుండా వర్షం వచ్చిందన్న సామెతను నిజం చేసినట్టుగా ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురిసినా వాతావరణం చల్లబడకుండా ఉక్కపోత ఉండడం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులే కారణమని పలువురు పేర్కొన్నారు.

దాతల 'దీవెన' కోసం ఎదురుచూపు



కాకినాడలో చికిత్స పొందుతూ దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న దీవెన

కాజులూరు: అంతుచిక్కని కణితుల వ్యాధితో బాధపడుతున్న కె గంగవరం మండలం పామర్రుకు చెందిన నున్న దీవెనకుమారి తనను ఆదుకోవాలని దాతల సహాయం కోసం ఎదురు చూస్తుంది. వివరాల్లోకి వెళ్లితే 25 సంవత్సరాల దీవెన తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం. గత కొన్నేళ్ల క్రితం తండ్రి రంగయ్య పక్షవాతంతో మంచాన పడగా, తల్లి మానసిక వ్యాధికి గురవ్వడంతో చిన్నతనంలోనే తన కుటుంబానికి తానే ఆధారమయింది. గత కొన్నాళ్ల కిత్రం మెదడుకు చిన్న ఆపరేషన్ జరిగి ముఖంపై ఒక కణితి రాగా పేదరికంతో దానికి శస్త్ర చికిత్స చేయించుకోలేక ఆ అంగవైకల్యాన్ని భరిస్తూ వచ్చింది. ఇటీవల భేడాది క్రితం కుడి కాలిపై వచ్చిన చిన్న, చిన్న కణితులు క్రమేపీ పెరిగి పెద్దయ్యాయి. ఆమె మాస్టర్ కిరణ్ ద్వారా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా కాలికి మూడు సార్లు ఆపరేషన్ చేయాలని, ఆరోగ్యశ్రీ వర్తించదని రూ.రెండు లక్షలు పైబడి ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ప్రస్తుతం ఆర్యావటానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ సంస్థ అధ్యక్షురాలు అనుసూరి శ్రావణి సహకారంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆపరేషన్ చేయించుకోకపోతే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారని నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఎటువంటి ఆధారం లేదని దీవెన వాపోతుంది. దాతలు సహకరించి ఆపరేషన్ చేయిస్తే తన ఆరోగ్యం మెరుగు పడుతుందని తన కుటుంబాన్ని తాను పోషించుకోగలుగుతానిని దీవెన దీనంగా దాతలను అర్థిస్తోంది.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆట పాటలతో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల 1989–90 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన 120 మంది పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరై సందడి చేశారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వచ్చే ఏడాది కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

బాలబాలాజీ స్వామికి రూ.1.43 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.43 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల ద్వారా రూ.1.08 లక్షల ఆదాయం రాగా, నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.35,650లు విరాళంగా అందించారు. మొత్తం 2,374 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 1,685 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు.

స్వామివారి సన్నిధిలో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం రాజమహేంద్రవరం అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పీఆర్ రాజీవ్ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య రామరంగాచార్యులు, వేదపండితుడు వేంకట శాస్త్రి, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది జడ్జి రాజీవ్‌కు అందజేశారు.

జాబ్‌మేళాకు 96 మంది విద్యార్థులు

కొత్తపేట: డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహా జాబ్‌మేళాకు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 96 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. చదువుకున్న ప్రతి విద్యార్థికి ఆ చదువుకు తగ్గ ఉద్యోగం కల్పించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని అనుసరించి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శనివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల (అటానమస్), తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నోడల్ రిసోర్స్ సెంటర్స్) పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు మహా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్, ప్లేస్మెంట్ ఆఫీసర్ టి.రమాదేవి, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా అనేక కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లో నియామక పత్రాలు అందజేస్తామని ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌ఓలు తెలిపినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

రావులపాలెం: మండలంలో లక్ష్మీపోలవరంలో పంటచేలు సమీపాన ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిపడేసిన చుట్టతో గడ్డిమేటుకు నిప్పంటుకుంది. దీంతో స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా ఫలితం లేకపోవడంతో సమాచారం అందుకున్న కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన తలపాకుల యేసుబాబుకు చెందిన పది ఎకరాల గడ్డివామికి మంటలు అంటుకున్నాయని అయితే ర. 80 వేలు విలువ చేసే గడ్డిలో సగం వరకు కాలిపోగా రూ.40 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని లీడింగ్ ఫైర్ మేన్ రాంప్రసాద్ తెలిపారు.

వాడపల్లిలో అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ కోర్కెలు నెరవేరడంతో స్వామి వారి అష్టోత్తర పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

స్నేహితుల ఆర్థిక సాయం

రాజోలు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతా అరుణ్ బోస్ కుటుంబానికి ఆయన స్నేహితులు, గల్ఫ్ యువనేస్తం సేవా సమితి సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. అరుణ్ బోస్ స్నేహితులు రూ.60 వేలు, గల్ఫ్ యువనేస్తం సేవా సమితి సభ్యులు రూ.20 వేలు అందజేశారు. గ్రామ పెద్దలు కుసుమ రాజ్‌కుమార్, గుబ్బల శ్రీనివాస్, కుడిపూడి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన హరీష్, కడలి శ్రీనివాస్‌గణపతి, దాకే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.